# 5

## ఎల్లమ్మ [redacted]

ఎల్లమ్మ అలా కళ్ళప్పగించి చూస్తోంది. 'ఊహుం మిగల్చడు! అరెరె. ఆ గుప్పెడు మెతుకులుకూడా దులుపు కొంటున్నాడే, కడుపాత్రపు వెధవ' అనుకున్నది మనస్సులోనే.

ఎల్లమ్మ అనుకున్నట్లే జరిగింది. సూర్యనారాయణ టిఫిన్ కారియర్‌లో వున్న ఆ కొద్దిపాటి అన్నాన్నికూడా విస్తట్లోకి వంచుకుని ముద్దచేసి మింగేశాడు. అది చూస్తూ నిల్చున్న ఎల్లమ్మకు గుండెకాయ ఎక్కడకో పైకి ఎగబాకుతున్నట్లు అనిపించింది. ఇవ్వాళ ప్రొద్దుటనుండి పంతం పట్టి కూర్చున్న ఆమె మనస్సుకు సూర్యనారాయణ చేసిన పనివల్ల అఘాతం కలిగింది.

“ఎల్లమ్మా! నీ డబ్బులు రేపు ఇస్తాలే. జీతం యివ్వాళ రాదు. ఇక కారియరు ఎత్తుకుపో” అన్నాడు సూర్యనారాయణ విస్తరిచుట్టి కిందకు గిరాటువేస్తూ.

“డబ్బు లెక్కడకుపోతాయ్‌లే బాబూ” అన్నది ఎల్లమ్మ. ఆ నిమిషాన రావలసిందేదో చెయ్యిజారినట్లు.

సూర్యనారాయణ ఆ ప్రక్కనే చెయ్యి కడుక్కుంటూ-“ఎల్లమ్మ! ఇవ్వాళ గిన్నెలో మెతుకులు మిగలకుండా తినేశాను. దరిద్రుడికి ఆకలి ఎక్కువన్నట్లున్నది నా పని” అన్నాడు అదోలా నవ్వుతూ.

“అదేంటి బాబూ. మిగిలితే మాత్రం నేనేం చేసుకుంటానా?” అన్నది ఎల్లమ్మ ఆశ్చర్యాన్ని కనబరుస్తూ.

సూర్యనారాయణ గతుక్కుమన్నాడు. ఏదో 'బ్రతికి చెడ్డ మనిషిలా వుంది' అనుకున్నాడు.

ఎల్లమ్మ ఒక్కొక్కటే ఆరు టిఫిన్ కారియర్లు తట్టలోకి సర్దుకున్నది. తట్ట నెత్తికెత్తుకొని మేడమెట్లు దిగి రోడ్డుమీదకు వచ్చింది. తట్టలోవున్న ఖాళీ కారియర్లు, ఆమె అడుగుతీసి అడుగువేసినప్పుడల్లా పరస్పరం కూడబలుక్కుంటూ మర్మధ్వనులు చేస్తున్నాయి.

"ఎల్లమ్మ కివ్వాళ తెల్లరూపాయి రాదు......ఎల్లమ్మ కివ్వాళ..." అంటూ అవి ఎగతాళి చేస్తున్నట్లు వున్నది ఎల్లమ్మకు.

"ఏడ్చారు. మీ మొఖాలు కాల్చా!" అని గొణిగింది ఎల్లమ్మ. "తెల్లరూపాయి రాకపోతేనేం. కడుపాత్రపు సూరయ్య మిగల్చకపోతేనేం! రమణయ్య బాబూ నాగేశ్వరరావు బాబూ ఇంకా......నా మతిమండ, ఆయన పేరేదో గుర్తుండి చావదు..........వాళ్ళ గిన్నెల్లో సగం సగం మిగిల్చారు ఎట్లా లేదన్నా అదంతా కలిపి అమ్మితే మూడు పావలాలు వస్తయ్ చాలు. చాల కెందుకూ......" అంటూ గొణుక్కున్నది ఎల్లమ్మ.

ఎల్లమ్మకు యీ రకమైన గొణుగుడు ఈ మధ్య బాగా అలవాటు కావడమే కాకుండా, క్రమంగా వంట జీర్ణించుకు పోతోంది. హారన్ కొట్టకుండా ప్రక్కనే దూసుకుపోయే కార్లనుగురించీ, ఎక్కడో చాలాదూరంగా మొరిగే కుక్కల్ని ఉద్దేశించి ఆమె ఇలాగే లోన గొణుక్కుంటుంది.

ఎల్లమ్మ బ్రతుకును యీడ్చేందుకు నెత్తిమీద తట్టలో బరువుగావున్న ఆ టిఫిన్ కారియర్లే ఆసరా ఇస్తున్నాయ్. ఎల్లమ్మ ఎక్కడ పుట్టింది? ఎలా బ్రతికింది? ఈ యాభయ్యో పడిలో ఇలా మద్రాసు ఎందుకు చేరిందీ? ఎవరినైనా అడిగితే జవాబు దొరకటం కష్టం.

మెడలో యింతపాటి—చింతాకుపాటి ప్రమాణంలో ఏదో మంగళసూత్రం లాటిది ఒకటి మెరుస్తూంటుంది. అయినా ఆమె వంటరిగానే పాత మాంబళంలో కూలేందుకు సిద్ధంగా వున్న ఒక గుడిసెలో కాపురం పెట్టింది. మొగుడు బతికే వుండొచ్చు. తన్నితరిమేసే వుండొచ్చు కొడుకూ వుండొచ్చు గడప తొక్కితే కాళ్ళిరగ్గ కొడతానని వుండొచ్చు. బహుశా కూతురూ వుందేమో ఇంటిచాయలొస్తే ముఖంమీద కళ్ళాపు చల్లుతానని వుంటుంది.

అందుకే పాత మాంబళంలోని ఒక జీర్ణకుటీరం ఆమె నివాస స్థానమై వుంటుంది. రోజూ ఒంటిగంటకల్లా ఎగ్మూరులోని 'బ్యాంకు'లో పనిచేసే

గుమాస్తాలకు కారియర్లలో భోజనాలు తీసుకువెళ్ళి అందించటం. ఆమెకు బ్రతుకు మార్గం ఇదే. వాళ్ళు ఎలక్ట్రిక్ ట్రెయినుకు టిక్కెట్టు కొనిపెట్టి, కారియర్ తెచ్చినందుకు తలా రెండురూపాయ లిస్తారు. ఆ విధంగా పన్నెండు రూపాయల సంపాదన. పైన......

ఇక్కడే ఎల్లమ్మకు తీరని సమస్యలన్నీ చుట్టుముట్టుతున్నయ్. రోజూ ఎగ్మూరు స్టేషన్‌లో రైలెక్కి, తట్టలోన కాళీ కారియర్లని కొత్త—పాత మాంబళంలోని ఇళ్లల్లో ఎవరిది వారికి ఇచ్చి గుడిసె చేరేవరకూ — ఆమెకు అన్నీ సమస్యలే. అంతా అంతూ పొంతూ దొరకని ఆలోచన.

ఈరోజు అంతే జరిగింది. యివ్వాళ తెల్లని రూపాయి కళ్ల చూడాలని అనుకొన్నది నిద్రమంచం మీదనుంచి లేస్తూనే. ఎందుకలా అనుకున్నదో, ఏ ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి అలా అనుకున్నదో ఆమెకే తెలియదు.

'ఊహుఁ పాపం! అలా అనుకోకూడదు. పాపిష్టిదాన్ని' అని అనుకున్నది. ఆ ఆలోచన మనస్సులో మెదలగానే "ఇవ్వాళ రోజూకంటే ప్రతి వాళ్ళూ కారియర్లలో కొంచెం ఎక్కువ అన్నమే వదిలేస్తారు. ఆ సూర్యనారాయణబాబు అసలే పిట్టమెతుకులు తినేవాడు. ఈరోజు అసలే అన్నం సహించక పోవచ్చును. అంతా అలాగే వదిలేస్తారు. పొద్దుగూకిం తరువాత మాంబళం స్టేషన్‌దగ్గర ఆ అన్నమంతా ముద్దలుచేసి రిక్షావాళ్ళకు అమ్మ జూపితే...తప్పక ఈరోజు తెల్లని రూపాయి కళ్ళచూస్తాను."

ఇలా అనుకున్నది. అనుకోవటం పాపం అనుకుంటూనే మళ్ళీ మళ్ళీ అనుకున్నది. కాని తీరా అనుకున్నదానికి అన్నీ అవాంతరాలే కలిగాయి. ప్రతివాళ్ళూ ఈ రోజు ఒకముద్ద ఎక్కువే తిన్నారు. ఇక సూర్యనారాయణ కరువొచ్చినట్లు ఆఖరు మెతుకుతో సహా నోట్లో వేసుకున్నాడు.

ఎవరి కారియర్లు వాళ్ళకి అప్పజెప్పి ఎల్లమ్మ గుడిశె చేరింది. పాత గుడ్డలో జాగ్రత్తగా మూటగట్టిన సాంబారు, రసాలతో తడిసివున్న అన్నం విప్పిచూస్తే...అంతా కలిపి పదాణాలు తెచ్చేట్టులేదు. తను ప్రొద్దున వండుకున్న అన్నం కొంతరాత్రికి మిగుల్చుకున్నది తనెంత దరిద్రాన్ని అనుభవిస్తున్నా, వాళ్ళూ, వీళ్ళూ మిగిల్చిన ఎంగిలి మెతుకులు తినాలంటే చెడ్డఅభిమానం, అసహ్యంకూడా కలుగుతుంది.

ఈ మధ్య తన దగ్గర అన్నం ముద్దలు కొనటానికివచ్చే రిక్షా వాళ్ళకూ, తిరుగుబోతులకూ కూడా గోటు ముదురుతోంది. "ఎంగిలిమెతుకులు...సద్ది కూడు..." అని మొఖాన్నే అనేస్తున్నారు. సచ్చినోళ్ళు...అందులో కొందరూ అరవంలో ఏదో పెద్దగా అంటారు. ఆ కీసర బాసర తన కసలే అర్ధమయి చావదు.

ఆ అళగమ్మ...ఆ పేరే తనకు చోద్యంగా వినిపిస్తుంది......తన కెదురుగా పోటీ బేరం పెట్టింది. మంచి వయసులోవున్నది. తన దగ్గర అంతకు ముందు అన్నం ముద్దలు కొనేవాళ్ళు కొందరు ఇప్పుడు ఆ అళగమ్మ దగ్గర కొనుక్కు తింటున్నారు. ఏదో వయస్సులో వుంది అంతే. తనకంటే ఏమంత ఎక్కువ పెట్టదు సరిగదా...ఆ నీళ్ళవోడే చద్దిమెతుకులే కళ్ళు తిప్పుతూ, ఎకసెకా లాడుతూ, వాళ్ళను నవ్విస్తూ తినిపిస్తుంది."

సాంబారూ, రసాలతో తడిసివున్న అన్నం ముద్దలుచేసి, చిన్న బుట్టలో పెట్టుకొని మాంబళం స్టేషన్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నది ఎల్లమ్మ ఆలోచిస్తూ. అప్పటికే అళగమ్మ చుట్టూ నలుగురైదుగురు చింపిరి చొక్కాల వాళ్ళుచేరి నానా హంగామా చేస్తున్నారు. బహుశా అళగమ్మ సొంతగా వండి అన్నం బేరం చేస్తోందేమో అనుకున్నది ఎల్లమ్మ అటుచూస్తూ.

తన కివాళ ఎలాగూ తెల్లరూపాయి కళ్ళచూసే యోగంలేదు. ఎదురుగా బుట్టలోవున్న ఐదు అన్నం ముద్దలను ఒక్కొక్కటి రెండు అణాల చొప్పున అమ్మితే...మొత్తం పదణాలు ముట్టుతాయి. ఆ కొనేవాళ్ళలో కర్మంచాలక కొసిరేవాళ్ళు దాపరించారా—అర్ధరూపాయికంటే ఎక్కువ రాదు.

"బేడకు కొనే అన్నంవెళ్ళకు కూడా గునిసి చస్తారు ముష్టి వెధవలు" అని గొణుక్కోసాగింది ఎల్లమ్మ. అలాంటి మనుషులంటే తనకు వళ్ళు మండుకొస్తుంది. తను మద్రాసు వచ్చిన కొత్తలో...ఆ సంగతి ఆలోచిస్తే మనస్సు కలతబారుతుంది. అసలు అన్నం అమ్ముకోవటమే పాపం అనుకునేది.

"ఆకలిగా వుంది..." అంటూ ఒక ఆడమనిషి వచ్చి ఎల్లమ్మకు ఎదురుగా కూర్చున్నది. ఆమె కట్టుకున్న వస్త్రానికి చీర ఆకారంలేదు. పీలికలు ముడిపెట్టి చుట్టుకున్నట్లున్నది. సగం విరబోసుకున్న జుట్టు. పాతికేళ్ళకంటే ఎక్కువ వుండవేమో అనిపించింది. ఎల్లమ్మకు పిచ్చిదేమోనన్న అనుమానం కూడా కలిగింది.

"ఆకలిగావుంది...అన్నం..." అని మళ్లీ రొప్పుతూ అడిగింది ఆ స్త్రీ.

"బేడదా, పావలాదా ?" అన్నది ఎల్లమ్మ తన ఆలోచన లన్నింటినీ బేరంవైపు త్రిప్పుకుంటూ.

"ఆకలిగావుంది. ఎంతోకొంత ఇయ్యి" అంటూ ఆ ఆడమనిషి చేయి చాపింది.

ఎల్లమ్మ బుట్టలోవున్న ఒక్క ముద్దను అందిస్తూ 'బేడా' అన్నది. ఆ స్త్రీ ఒక్కసారి ముద్దను నోట్లో పెట్టుకున్నది. కొలమారి సగం మళ్ళీ చేతిలోకి తీసుకున్నది. వంచిన తల ఎత్తకుండా ఆత్రంగా తినేసి మరల చేయి చాపింది.

"దీన్తో పావలా" అంటూ ఎల్లమ్మ మరో ముద్ద చేతులో పెట్టింది. ఆ ముద్దకూడ ఆత్రంగా తినేసి, ఆ స్త్రీ మరల చెయ్యి చాపింది. ఎల్లమ్మకు అప్పటిగ్గాని ఆ మనిషి పిచ్చిదై వుంటుందన్న అనుమానం దృఢపడలేదు.

"ముందు పావలా యివ్వు, తరువాత సంగతి చూద్దాం" అంటూ చెయ్యి చాపింది ఎల్లమ్మ.

"నేను పిచ్చిదాన్ని, డబ్బుల సంగతి నాకు తెలియదు" అన్నది ఆ స్త్రీ తిరిగి చెయ్యి చాపుతూ.

ఎల్లమ్మకు నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఆ స్త్రీ పిచ్చిదికాదని గ్రహించింది. పిచ్చివాళ్లు తమకు పిచ్చిఅని చస్తే ఒప్పుకోరు. తన్ను నిలువునా మోసగించి కడుపు నింపుకోవాలని చూస్తుంది. ఎల్లమ్మకు ఒళ్లు తెలియని కోపం వచ్చింది.

"పావలా అక్కడపెట్టి కదులు. డొక్క చీరేస్తాను, ఎవరనుకున్నావో" అంటూ లేచి ఆ స్త్రీ జుట్టు లంకించుకున్నది ఎల్లమ్మ.

ఇంకేం ఆ చుట్టూ జనం చేరారు. వాళ్ళలో చాలామంది అరవం మాట్లాడుతున్నారు. ఎల్లమ్మకు ఏం చెప్పాలో తెలియటంలేదు. తెల్లరూపాయిని కళ్ళచూడాలని పొద్దుటినుండి గట్టిపట్టు పట్టి కూర్చున్న మనస్సును, పదణాలతో బుజ్జగిద్దామనుకుంటే...దానికే ఎసరు పెట్టింది యీ దొంగ పిచ్చిది. "దీసి తాడు తెగా, నాలుగణాల అన్నం మింగి కూర్చున్నది" గొణిగింది ఎల్లమ్మ.

చుట్టూ చేరినవాళ్ళు ఎవరేమన్నా వినిపించుకోకుండా కూడా—

"నా పావలా నా కివ్వు. లేకపోతే..." అంటోంది ఎల్లమ్మ.

"ఎవరో, పాపం పిచ్చిది" అన్నారు జనంలోనుంచి ఒకరు.

"అవును. పిచ్చిదే!" అంటూ తాళం వేశాడు యింకొకడు.

"పెద్దమనుషులు బయలుదేరారు తీర్పులు దిద్దటానికి, నేను పిచ్చిదాన్ని అని చెప్పకోనేది పిచ్చిదెలా అవుతుంది." అని నిలదీసి అడిగింది ఎల్లమ్మ. చుట్టూవున్న జనాన్ని కొరకొర చూస్తూ.

"అది పిచ్చిదే" అంటూ ఓ నడికారు రిక్షావాడు జనాన్ని తోలగ నెట్టుకుంటూవచ్చి ఎల్లమ్మ ముందు నిలబడ్డాడు.

"పిచ్చిదానికీ ఆకలి వుంటుంది కామాలు?" బుగ్గ నొక్కుకుంటూ ఆశ్చర్యాన్ని కనపరచింది, ఓ పట్టుచీర కట్టుకునివున్న నడికారు స్త్రీ. అంతా నవ్వారు.

"ఆడదాన్ని ఆడదే ఆదుకోకపోతే ఎలా ఎల్లమ్మా?" అన్నాడు రిక్షావాడు.

"దాని మొగుడు ఏ పీట్లో కలిశాడు?" అన్నది ఎల్లమ్మ పళ్ళు కొరుకుతూ.

"ఐతే నీ మొగుడు?" అన్నాడు రిక్షావాడు.

ఎల్లమ్మ తెల్లబోయింది. నోట మాట రాలేదు. గొంతు తడారిపోతున్నట్టుంది.

"అది పిచ్చిదే...అంటే ఆకలి పిచ్చిది. నెల్లూరుదగ్గర ఎనబోతులపాలెం నుండి వచ్చింది. మొగుడు వదిలేశాడు. తల్లీ వాళ్లూ......"

"ఎనబోతులపాలెంనుండా?" నిలువు గుడ్లువేసి ప్రశ్నించింది ఎల్లమ్మ.

"ఏం?" అన్నాడు రిక్షావాడు.

ఎల్లమ్మ ఆ జుట్టువదలి పక్కగా చతికిలబడ్డది.

"మీరంతా యిక్కడెందుకు మూగారు? పోండి. నా యిష్టం. నా డబ్బులు వసూలు చేసుకుంటాను, మానేస్తాను. పోండి" చుట్టూమూగిన జనాన్ని వుద్దేశించి అరిచింది ఎల్లమ్మ.

"మరో పిచ్చిది" అన్నాడు ఒకడు.

కాసేపటికల్లా చుట్టూమూగిన జనం ఒక్కొక్కరే జారుకున్నారు. ఎల్లమ్మా, ఆ ఆడమనిషి అలా పక్కపక్కనే మౌనంగా కూర్చుని వున్నారు. రిక్షావాడు వాళ్లకు కొంచెం ఎడంగా రిక్షాలో కూర్చొని బీడీ ముట్టించాడు.

"మ...మంగయ్య నెరుగుదువా?" అని అడిగింది ఎల్లమ్మ ఆ స్త్రీని.

"ఆఁ ఎరుగున్నాను. ఈమధ్యనే చచ్చిపోయాడు" అన్నది ఆ స్త్రీ. ఎల్లమ్మ 'ఆఁ' అంటూ నివ్వెర పోయింది. అంతలోనే తేప్పరిలి మెడలో వేలాడుతున్న మంగళసూత్రాన్ని పుటుక్కున, రెండు చేతులతో తెంపి... "మరి నీ మొగుడో...మంగళసూత్రం లేదేఁ!" అన్నది ఎల్లమ్మ.

"బతికే వున్నాడు. తెంపుకుని తరిమేశాడు చచ్చినోడు."

"అయితే, యిది కట్టుకో. రేపట్నుంచీ నాతోపాటు ఎక్కడోచోట పని కుదురుస్తాను. ముందు యీ కాస్త అన్నంకూడా తిను" అంటూ ఎల్లమ్మ బుట్టలో మిగిలివున్న అన్నం ముద్దల్ని ఆ స్త్రీ చేతిలో పెట్టింది.

"మంగయ్య నీ కేమవుతాడు?" అంటూ రిక్షావాడు చేతిలో బీడీ అవతల పారేసి, తుపుక్కున వూస్తూ రిక్షా పైకెత్తాడు.

"ఏమీ కాడు."

"కొడుకు విన్నన్నో?"

"నీ కేమన్నా పిచ్చా?"

"అవును పిచ్చే. ఆకలి పిచ్చి... తెలిసిన పిచ్చి... తెలియని పిచ్చి. రకరకాల పిచ్చులు..." అంటూ రిక్షావాడు గోడ్డంట పడి పోతున్నాడు.

ఎల్లమ్మ మారు మాట్లాడకుండా ఖాళీ బుట్టను ఆ స్త్రీచేతి కిచ్చి "రా" అంటూ గుడిసె కేసి బయలుదేరింది.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక-1954)